సాక్షి నిజామాబాద్

గురువారం । 9 । జనవరి । 2025



సైబర్ నేరాలపై అప్రమత్తం..
సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ విభాగం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు సూచించారు.
- 8లో ▸



మహిళలను కోటీశ్వరులను..
మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని, కోటీశ్వరులను చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.2 /13.1
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచుకురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పోలీస్ క్యూఆర్ కోడ్



ఖలీల్‌వాడి: ఫిర్యాదుదారులతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు, వారి స్పందనపై ఫీడ్ బ్యాక్‌ను సేకరించేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ గురువారం నుంచి అందుబాటులోకి వస్తుందని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లు, రద్దీ ప్రాంతాల్లో క్యూ ఆర్ కోడ్‌కు సంబంధించిన పోస్టర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఫీడ్ బ్యాక్ అందజేయాలని కోరారు.

నేడు మైనారిటీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ నేడు (గురువారం) జిల్లా కేంద్రానికి రానున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు జిల్లా అధికారులతో చైర్మన్ సమావేశం అవుతారని, మధ్యాహ్నం 2 గంటల వరకు మైనారిటీ వర్గాల వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి వృద్ధాశ్రమం సేవలు

నిజామాబాద్‌అర్బన్: డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో ప్రభుత్వం నిర్మించిన వృద్ధాశ్రమం ఈనెల 10వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు వసతి కల్పించేందుకు నిర్మించిన వృద్ధాశ్రమాన్ని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వయో వద్ధుల పోషణ, చట్టం జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నిరాశ్రయులైన వయో వృద్ధులకు రాంపూర్‌లోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ (98499 33300) లేదా వృద్ధాశ్రమ కో ఆర్డినేటర్(96188 44461), జిల్లా సంక్షేమ అధికారి, మహిళాశిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సీఐ,ఎస్సై, కానిస్టేబుల్‌కు లోకాయుక్త నోటీసులు?



ఖలీల్ వాడి: తనపై అక్రమంగా కేసు పెట్టారని ఓ యువకుడు ఫిర్యాదు చేయడంతో కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ సీఐతోపాటు ఎస్సై, కానిస్టేబుల్‌కు లోకాయుక్త నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఓ వ్యవహారంలో గతంలో సీఐపై అప్పటి సీపీ కల్మేశ్వర్‌కు తాను ఫిర్యాదు చేయగా, కక్ష గట్టిన తనపై కానిస్టేబుల్ కుటుంబ సభ్యులతో ఫిర్యాదు చేయించి ఎస్సై అక్రమంగా కేసు నమోదు చేశారని యువకుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారుతోపాటు సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌కు ఈనెల 3వ తేదీన నోటీసులు పంపినట్లు సమాచారం. ఈనెల 22వ తేదీన లోకాయుక్తకు రావాలని ఫిర్యాదుదారుడికి ఫోన్ వచ్చినట్లు తెలిసింది.

వివాదాస్పద ఫైల్ కదలికలో

మర్మమేమిటో?

కోర్టులో వివాదంలో ఉన్నప్పటికీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014లో నియామకమైన అధ్యాపకుల పదోన్నతుల ఫైల్ మళ్లీ ముందుకు కదలడంపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అధ్యాపకుల నియామకాలు చెల్లవని గతంలో వర్సిటీ పాలకమండలి తీర్మానం చేస్తూ క్రిమినల్ కేసు పెట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ప్రొఫెసర్లతో నియమించిన ద్విసభ్య కమిటీ, అప్పటి గవర్నర్ వేసిన కమిటీ అధ్యాపకుల నియామకాలు అక్రమమని నివేదికలు ఇచ్చాయి.

- తెలంగాణ యూనివర్సిటీ పాత వివాదంలో కొత్త కథ
- పూర్తి స్థాయి పాలకమండలి ఏర్పాటు కానప్పటికీ ప్రక్రియ వేగవంతం
- గతంలో అనేకసార్లు తిరస్కరిస్తూ చేసిన పాలకమండలి తీర్మానాలు బేఖాతరు
- ఈ వివాదాస్పద నియామకాల సీఏఎస్ పదోన్నతులపై గతంలోనే తిరస్కరణ
- ఒకే అంశంలో ఒక్కో ప్రొఫెసర్‌కు ఒక్కోవిధంగా నిబంధనలు అమలు చేస్తున్న వైనం
- వక్రమార్గాలపై గతంలోనూ అనేకసార్లు అక్షరయుద్ధం చేసిన 'సాక్షి'





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014లో నియామకమైన అధ్యాపకుల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పదోన్నతుల విషయంలో గతంలో పాలకమండలి అనేకసార్లు తిరస్కరించింది. ఈ అంశాలపై 'సాక్షి' దినపత్రిక గతంలో అక్షర యుద్ధం చేసింది. వరుస కథనాలు రాయడంతో అక్రమానికి బ్రేక్ పడింది. మళ్లీ ఇప్పుడు మరోసారి ఆ అక్రమ వ్యవహారానికి పదును పెట్టారు. దీంతో విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఫైల్ కదలికలో రూ.5 కోట్లు చేతులు మారినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశం కోర్టులో ఉన్నప్పటికీ కొత్తగా మళ్లీ ఫైల్‌ను వేగంగా నడిపిస్తున్నారు. కోర్టులో ఉన్న ఈ అంశానికి సంబంధించి ముందుకు వెళ్లాల్సిన అవసరం లేదని గతంలో పలుసార్లు పాలకమండలి తేల్చి చెప్పింది. విషయంలోకి వెళితే 2014లో అప్పటి వీసీ అక్బర్ అలీఖాన్ ఈ అధ్యాపకులను నియమించారు. ఈ నియామకాలు చెల్లవని 41వ పాలకమండలి సమావేశంలో తీర్మానం చేయడంతో పాటు క్రిమినల్ కేసు పెట్టాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రసాదరావు, భాస్కర్‌రావు అనే ఇద్దరు ప్రొఫెసర్లతో ద్విసభ్య కమిటీ వేసింది. మరోవైపు అప్పటి గవర్నర్ నరసింహన్ సైతం సీవీ రాములు కమిటీ వేశారు. ఈ రెండు కమిటీలు నియామకాలు అక్రమమని నివేదికలు ఇచ్చాయి. ఈ క్రమంలో వ్యవహారం కోర్టులో ఉండడంతో 43, 45, 48, 53 ఈసీ సమావేశాల్లో 2014 నియామకాల ప్రమోషన్లను తిరస్కరించారు. రవీందర్‌గుప్తా వీసీగా ఉన్న సమయంలో రూ.4 కోట్లతో డీల్ కుదుర్చుకుని ఫైల్ కదిపినట్లు తెలియడంతో గందరగోళం నెలకొంది. అదే సమయంలో ఇతర అక్రమాలు, అవకతవకలు, అక్రమ నియామకాల నేపథ్యంలో వర్సిటీ పరువు పోయింది. ఈ క్రమంలో కొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అసోసియేట్ ప్రొఫెసర్లుగా కాకుండానే నేరుగా ప్రొఫెసర్లుగా ఉన్నతి పొందే వ్యవహారాన్ని నడిపించారు. నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్ సర్వీసును కలుపుకున్నారు. వర్సిటీలో అక్రమాలపై 'సాక్షి' వరుస కథనాలతో ప్రభుత్వాన్ని కదలించింది. ఈ క్రమంలో అప్పటి వీసీ రవీందర్‌గుప్తా 2023 జూన్‌లో ఏసీబీకి చిక్కారు. ప్రొఫెసర్ల దొడ్డిదారి ప్రమోషన్ల కథ నిలిచిపోయింది. వీసీ అరెస్టుతో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమించింది. వాకాటి కరుణ హయాంలోనూ ఈ ఫైల్‌ను కదిలించారు. 'సాక్షి'లో కథనం రావడంతో ఎక్కడివారక్కడే గప్‌చుప్ అయ్యారు. మళ్లీ తాజాగా ఇప్పుడు ఈ ఫైల్‌ను గుట్టు చప్పుడు కాకుండా మూవ్ చేస్తుండడం గమనార్హం. ప్రస్తుతం ఈ విషయమై రూ.5 కోట్ల మేర డీల్ జరుగుతున్నట్లు సమాచారముందని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. పూర్తి స్థాయి పాలకమండలి ఏర్పాటు కానప్పటికీ ఇంత హడావుడిగా వివాదాస్పద ఫైల్‌ను వేగంగా మూవ్ చేస్తుండడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

■ ప్రభుత్వ ప్లీడర్ వాణీరెడ్డి ఒపీనియన్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తమ నియామకాలను ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలని కోరుతూ 2014 నియామక అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలని అప్పటి వీసీ, రిజిస్ట్రార్‌లను పాలకమండలి ఆదేశించింది. ఇలా ప్రతి పాలకమండలి సమావేశంలో తిరస్కరణకు గురైన వివాదాస్పద నియామకాలకు విద్యాశాఖ కార్యదర్శితో ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి ఏవిధంగా లీగల్ ఒపీనియన్ తీసుకునేలా ఒప్పించారనేది ప్రశ్నార్థకంగా ఉంది. మొదటి లీగల్ ఒపీనియన్ తీసుకునేముందే పాలకమండలి అనుమతి కోరారు. మరి ఇప్పుడు పాలకమండలిని ఎందుకు మరిచారో, పూర్తి స్థాయిలో పాలకమండలి లేని సమయంలో ఆగమేఘాల మీద గుట్టుచప్పుడు కాకుండా లీగల్ ఒపీనియన్‌కు ఎందుకు పంపారనేది తెలియాలని పలువురు అంటున్నారు.

2019 మార్చి 30న జరిగిన 44వ పాలకమండలి సమావేశంలో కూడా ఈ అంశం ప్రస్తావన వచ్చింది. తరువాత తమకు పదోన్నతి కల్పించాలని కోరుతూ వివాదాస్పద 2014 అభ్యర్థులు పెట్టుకున్న వినతిని 48వ పాలకమండలి సమావేశం తోసిపుచ్చింది.

■ తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు 2014 నియామకాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నుంచి 2022 జూలై 13న లేఖ వచ్చింది. అయినప్పటికీ ప్రస్తుతం ఇంత బేఖాతరుగా వ్యవహరిస్తున్నారు. వరంగల్‌కు చెందిన మామిడాల సుధాకర్ ద్వారా లీగల్ ఒపీనియన్ తీసుకున్నారు. అర్ధరాత్రి చర్చలు జరిపి అనుకూలంగా నివేదిక తీసుకున్నారు. పైగా కోర్టులో తగిన వాదన వినిపించకుండా వివాదాస్పద రీతిలో నియామకమైనవారికి అనుకూలంగా పదోన్నతులు కల్పించేందుకు వీలుగా వేగంగా పావులు కదుపుతుండడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

కనకయ్య విషయంలో ఒకలా

యూజీసీ నిబంధనలు ఉల్లంఘించి తనకు తానే కనకయ్య ఉద్యోగోన్నతి పొందినట్లు చూపించిన రిజిస్ట్రార్ యాదగిరి ప్రభుత్వానికి తెలిపారు. దీనిపై లోక్ అదాలత్‌లో అప్పీల్‌కు వెళ్లారు. ఇదిలా ఉండగా మరో నలుగురు ప్రొఫెసర్ల విషయంలో మాత్రం అప్పీలుకు వెళ్లకుండా ప్రమోషన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేయడం గమనార్హం. ఒకే అంశంలో కనకయ్య విషయంలో ఒకలా.. మిగిలిన వాళ్ల విషయంలో మరోలా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

పాలకమండలి తీర్మానాన్ని బేఖాతరు చేస్తూ..

వర్సిటీలో అక్రమాలపై గతంలో పాలకమండలి అలుపెరగని పోరాటం చేసింది. గత వీసీ రవీందర్ గుప్తా, రిజిస్ట్రార్ల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు తీర్మానం చేసింది. విజిలెన్స్ విచారణ సైతం నడుస్తోంది. వాకాటి కరుణ ఇన్‌చార్జి వీసీగా ఉన్నప్పుడు పాలకమండలి సభ్యులు తిరస్కరించినప్పటికీ ప్రమోషన్ల అంశంపై లీగల్ ఒపీనియన్‌కు పంపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో వాకాటి కరుణ ఈ ప్రమోషన్ల వ్యవహారాన్ని అప్పటి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి తిరస్కరించారు. తరువాత బుర్రా వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా ఉన్న సమయంలో ఒక ఆదివారం రోజున వర్సిటీకి వచ్చారు. 2014 బ్యాచ్‌కు చెందిన కొందరు అధ్యాపకులు బుర్రా వెంకటేశంను రహస్యంగా కలిసి ఉద్యోగోన్నతులకు విన్నవించినట్లు ప్రచారం ఉంది.

లీగల్ ఒపీనియన్ పేరిట..

2014 నియామకాలు ఆది నుంచీ వివాదాస్పదమే. పలు ఆరోపణల నేపథ్యంలో 2012 ఏడాది చివరిలో ఇంటర్వ్యూలు నిర్వహించి, 2013 ఫిబ్రవరిలో నియామక పత్రాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అందుబాటులో ఉన్నవాళ్లను జాయిన్ చేసుకున్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సదరు నియామకాలకు బ్రేక్ పడింది. ఈ క్రమంలో నియామకాల్లో అక్రమాలపై విద్యార్థి సంఘాలు సాక్ష్యాలు బయటపెట్టగా పత్రికల్లో వార్తలు వచ్చాయి. అలాగే అర్హత ఉన్నప్పటికీ ఎంపిక కాని కొందరు ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వగా, ఇక్కడే పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నియామకాలపై సమగ్ర విచారణ జరిపేందుకు 2013 ఫిబ్రవరి 22న ఇద్దరు సభ్యుల కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఏప్రిల్ లోగా నివేదిక సమర్పించాలని కోరింది. ఆ తర్వాత 2013 ఫిబ్రవరి 25న ఈ నియామకాలకు సంబంధించి తదుపరి ఉత్తర్వులు వెలువరించవద్దని అప్పటి ప్రభుత్వం నిషేధం విధించింది. ఇదే సమయంలో అటు అకడమిక్ కన్సల్టెంట్లు సైతం ఈ నియామకాలపై హైకోర్టు నుంచి స్టే తెచ్చారు. ఈ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతూ రోజు రోజుకూ వివాదాస్పదంగా తయారైంది. ఈ విషయమై జస్టిస్ సీవీ రాములు ఇచ్చిన నివేదికపై అప్పటి గవర్నమెంట్ ప్లీడర్ (ఉన్నత విద్యాశాఖ) సి వాణిరెడ్డి ద్వారా లీగల్ ఒపీనియన్ కోరుతూ 41వ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ తరువాత ఈ నియామకాలపై జస్టిస్ సీవీ రాములు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. 2018 సెప్టెంబర్ 26న జరిగిన పాలకమండలి సమావేశంలో జస్టిస్ సీవీ రాములు ఇచ్చిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన పాలకమండలి, ఆయా నియామకాల్లో అక్ర మాలు జరిగాయని గుర్తించింది. తీవ్రంగా పరిగణించి సదరు నియామకాలు చేపట్టిన అప్పటి వీసీ ఆచార్య అక్బర్ అలీఖాన్, రిజిస్ట్రార్ ఆచార్య అశోక్‌లపై ఉస్మానియా యూనివర్సిటీ సర్వీస్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ వర్సిటీకి లేఖ రాయాలని తెలంగాణ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లను పాలకమండలి సభ్యులు ఆదేశించారు. పైగా అక్బర్ అలీఖాన్ పెన్షన్ బెనిఫిట్స్‌ను పూర్తిగా నిలిపేయాలని, అశోక్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని ఉస్మానియా వర్సిటీకి లేఖ రాయాలని నిర్ణయించారు. యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను ఉస్మానియా వర్సిటీ నుంచి తెప్పించుకోవాలని ఆదేశించారు. జస్టిస్ సీవీ రాములు నివేదిక ప్రకారం అక్బర్ అలీఖాన్, అశోక్‌లపై సత్వరమే క్రిమినల్ కేసు పెట్టాలని వర్సిటీ వీసీ ఆచార్య సాంబయ్య, రిజిస్ట్రార్ బలరాములు లను పాలకమండలి ఆదేశించింది.

తనయుడి జాడ కోసం వెళ్తే.. ఎదురొచ్చిన మృత్యువు

- రైలు ఢీకొని తండ్రి మృతి
- మెదక్ జిల్లా అక్కన్నపేటలో ఘటన



నర్సింలు (ఫైల్)

భిక్కనూరు: ఆత్మహత్య చేసుకుంటానని స్నేహితుడికి ఫొటోలు పంపిన కొడుకు ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి రైలు ఢీకొని మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడు కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. వివరాలు ఇలా ఉన్నాయి. భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన గంగయ్య గారి నర్సింలు(48) ఆయన కుమారుడైన రాజశేఖర్‌లకు వారి దాయాది అయిన గంగయ్యగారి స్వామితో మంగళవారం భూమి విషయమై గొడవ జరిగింది. ఈ విషయమై స్వామి భిక్కనూరు పోలీసులకు నర్సింలు, రాజశేఖర్‌లపై ఫిర్యాదు చేశాడు. తర్వాత అదే రోజు మధ్యాహ్నం నర్సింలు, కొడుకు రాజశేఖర్ మధ్య కూడా గొడవ జరిగింది. దీంతో నర్సింలు పోలీస్ స్టేషన్‌లోతన కుమారుడిపై ఫిర్యాదు చేశా డు. విషయం తెలుసుకున్న రాజశేఖర్ ఆత్మహత్య చేసుకోవాలని భావించి మెదక్ జిల్లా అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ పట్టాలపై పడుకుని సెల్ఫీఫొటోను తన మిత్రుడికి పంపించా డు. వెంటనే సదరు మిత్రుడు ఈవిషయాన్ని గ్రామస్తులకు, నర్సింలుకు తెలియజేశాడు. అప్రమత్తమైన గ్రామస్తులు, నర్సింలు, ఆయన భార్య సత్తవ్వలు పోలీసులకు సమాచారం అందించి అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. గ్రామస్తులు, పోలీసులు ఒక వైపు, నర్సింలు ఆయన భార్య సత్తవ్వ మరో వైపు వెతకడం ప్రారంభించారు. పోలీసులకు గ్రామస్తులకు రాజశేఖర్ కనిపించగా ఆయనను పట్టుకున్నారు. ఇంకో వైపు వెతుకున్న నర్సింలును అదే సమయంలో వస్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తనయుని ఆచూకీ కోసం వెళ్లిన తండ్రి మృతి చెందడంతో భాగిర్తిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్ భవన్ ముట్టడి

- బీజేపీ, బీజేవైఎం నాయకుల అరెస్టు
- నగరంలోని కాంగ్రెస్ భవన్ వద్ద పోలీసు బందోబస్తు



బీజేవైఎం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



కాంగ్రెస్ భవన్ ఎదుట బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌ను బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ముట్టడించారు. బుధవారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ భవన్‌కు ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో కాషాయ కార్యకర్తలు వచ్చారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. నాంపల్లిలోని బీజేపీ ప్రధాన కార్యాలయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ముట్టడించడమే కాకుండా అడ్డువచ్చిన సాధారణ కార్యకర్తలపై దాడిచేయడం హేయమైన చర్యఅని అన్నారు. నిరసనగా కాంగ్రెస్ భవన్ ముట్టడికి యత్నించి నట్లు బీజేవైఎం నాయకులు తెలిపారు. కాంగ్రెస్ భవన్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్బన్ అభివృద్ధి వేగంగా జరగాలి

- ఇందిరమ్మ ఇళ్ల మరమ్మతులు ప్రారంభించండి
- రూ.60కోట్లతో డివిజన్‌ల వారీగా అభివృద్ధి పనులు చేపట్టాలి
- కలెక్టర్ హనుమంతుతో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్ధి వేగంగా జరిగేలా పాటుపడాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మరమ్మతులకు విడుదలైన రూ.1.25 కోట్లతో వెంటనే పనులను ప్రారంభించి మళ్లీ అర్హుల జాబితాను రూపొందించాలన్నారు. నగర ప్రజల ఆరోగ్యం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన అహ్మదీబజార్, ఖలీల్‌వాడిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నియోజకవర్గానికి మంజూరైన రూ.60కోట్లతో డివిజన్‌ల వారీగా పనులు చేపట్టేందుకు టెండర్లను పిలవాలని కోరారు. నగరంలో కబ్జాలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు ఇబ్బందులకు పడుతున్నారని, కబ్జాలపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఫుట్‌పాత్ కబ్జాలు, రోడ్లపై విచ్చలవిడిగా వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తోపుడు బండ్లతో రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారికి ప్రత్యేకంగా ఒక స్థలం కేటాయించాలని సూచించారు. స్మార్ట్ సిటీ కోసం ఎంపీతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. స్మార్ట్ సిటీ విధివిధానాలకు అనుగుణంగా ఇందూరు నగరాన్ని తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందని, అందుకు ప్రజలు సైతం సహకరించాలని అన్నారు. కలెక్టర్‌తో సమావేశమైన వారిలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఇంజినీరింగ్ విభాగం ఈఈలు సురేశ్, ప్రవీణ్, మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం ఎదురుచూపులు

- జీజీహెచ్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం
- పనులకు రూ.6.62 కోట్లు అవసరమంటున్న అధికారులు
- మూడు నెలల్లో రూపురేఖలు మారేనా?



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) మరమ్మతులకు తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎంఐడీసీ) ప్రతిపాదనలను సిద్ధం చేసింది. రూ.6.62 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. గత నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జీజీహెచ్ భవనంలో లీకేజీలు, స్థానిక పరిస్థితిని చూసి సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భవనానికి వెంటనే మరమ్మతులు చేయించాలని, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, మూడు నెలల్లో జీజీహెచ్ రూపురేఖలు మార్చాలని ఆదేశించారు.

మరమ్మతులు చేపట్టింది లేదు..

ఉమ్మడి రాష్ట్రంలో జీజీహెచ్ ప్రారంభమైంది. ఆ తరువాత ఒక్కసారి కూడా మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుత సూపరింటెండెంట్ ఈ ఐదేళ్లలో మరమ్మతుల దిశగా ఆలోచన చేయకపోవడంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పరిసరాలు అధ్వానంగా, అపరిశుభ్రంగా తయారయ్యాయి. భవనం చుట్టూ కింది పైనుంచి కింది వరకు పైప్ లైన్‌లకు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో ఎక్కడ చూసినా మురుగునీరు పారుతోంది. భరించలేని దుర్వాసన కారణంగా రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూపరింటెండెంట్‌లు ఎంత మంది మారినా మరమ్మతులను పట్టించుకున్న పాపాన పోలేదు.

చేపట్టే పనులు..

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు టీఎస్‌ఎంఐడీసీ అధికారులు జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో సమావేశమై చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రూ.6.62కోట్లతో పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. ఇందులో ప్రధానంగా రూ.కోటీ 65లక్షలతో డ్రైనేజీ పైపులైన్, టాయిలెట్స్, రూ.35లక్షలతో భవనం ఎలివేషన్, అదనపు పనులు, క్రిటికల్ కేర్‌కు రూ.89 లక్షలు, భవనం పెయింటింగ్‌కు రూ.2కోట్ల 35లక్షలు, తదితర పనులకు మొత్తం రూ.6.62 కోట్లు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

మంత్రి ఆదేశాల మేరకు..

మంత్రి ఆదేశాల మేరకు జీజీహెచ్‌ను పరిశీలించాం. సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రూ.6.62 కోట్లు అవసరం ఉంది.
– కుమార్, ఈఈ, టీఎస్‌ఎంఐడీసీ

ఉన్నతాధికారులకు విన్నవించాం

మంత్రి ఆదేశాల ప్రకారం టీఎస్‌ఎంఐడీసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిధుల కోసం ఉన్నతాధికారులకు విన్నవించాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశాలున్నాయి.
– రాజశేఖర్, ఏఈడీ, జీజీహెచ్

క్లుప్తంగా

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ:శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి యాసంగి సీజన్‌ ఆయకట్టు కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 228 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్టు ద్వారా 463 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిఫ్టు ద్వారా 312 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు,ఆవిరి రూపంలో 441 క్యూసెక్కుల నీరుపోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 క్యూసెక్కులు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1087.70(69 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

ఇందూర్‌ తిరుమలలో ‘వైకుంఠ ద్వార’ దర్శనం

నిజామాబాద్‌ రూరల్‌: మోపాల్‌ మండలం నర్సింగ్‌పల్లి గ్రామ శివారులోని ఇందూర్‌ తిరుమలలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి ‘వైకుంఠ ద్వార’ దర్శనం ఏర్పాటు చేసినట్లు మాపల్లె ట్రస్ట్‌ చైర్మన్‌, ఆలయ వ్యవస్థాపకులు నర్సింహ దాసు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో సేవచేయుటకు అసక్తిగలవారు ముందుకు రావాలని కోరారు.

ఈనెల 30లోపు పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్‌:అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్‌ 1, 2,3లకు రీఅడ్మిషన్‌ తీసుకున్న విద్యార్థులు ఈ నెల 30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని కోఆర్డినేటర్‌ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10వరకు రూ.500 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. యూజీ కోర్సులకు సంబంధించి మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్షలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఆరవ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అలాగే యూజీ రెండు, మూడు సెమిస్టర్‌ పరీక్షలు ఫిబ్రవరి 7నుంచి 13 వరకు కొనసాగుతాయన్నారు. ఒకటో సెమిస్టర్‌ పరీక్షలు ఫిబ్రవరి 15నుంచి 21వరకు కొనసాగుతాయన్నారు.

ఎస్సెస్సీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి పరీక్షల రుసుము చెల్లింపు గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాద రుసుంతో ఈనెల 23 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం డీఈవో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

తాగిన మైకంలో స్నేహితుడిపై కొడవలితో దాడి

నందిపేట్‌(ఆర్మూర్‌): మండలంలోని కుద్వాన్పూర్‌ గ్రామంలో ఇద్దరు మిత్రులు మద్యం తాగగా, మైకంలో ఒకరిపై కొడవలికి తెలిసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. కుద్వాన్పూర్‌ గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన తుంగెన గణేష్‌ తన ఇంట్లో మిత్రుడు తోట గంగమల్లుతో కలిసి మద్యం తాగారు. మైకంలో ఇద్దరు గొడవపడగా గణేష్‌ ఇంట్లోకి వెళ్లి కొడవలి తీసుకొచ్చి గంగమల్లు మెడను కోయడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు గమనించి గంగమల్లును స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌ తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌టౌన్‌(బోధన్‌): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను విధిస్తూ సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. బోధన్‌లో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు చేపట్టగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని బుధవారం కోర్టులో హాజరుపరచగా,విచారణ అనంతరం రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ప్రవాసీయులపై పట్టింపేదీ?

- ప్రభుత్వాలకు ఆదాయం లభిస్తున్నా.. వారి సంక్షేమంపై దృష్టిసారించని వైనం
- నేడు ప్రవాసీ భారతీయ దినోత్సవం



మోర్తాడ్‌(బాల్కొండ): ప్రవాస భారతీయుల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీ మొత్తంలో ఆదాయం సమకూరుతున్నా వారి సంక్షేమంపై చిత్తశుద్ధి లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తరువాత గల్ఫ్‌ వలస కార్మికుల కోసం కొన్ని సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకవచ్చారు. గల్ఫ్‌యేతర దేశాల వలస కార్మికుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది.ప్రతి ఏటా జనవరి తొమ్మిదో తేదిన ప్రవాస భారతీయ దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా జరుపుతున్నా.. వారి బాగోగుల గురించి ఆలోచించే వారు లేకపోవడంతో ప్రవాసీయులకు నష్టం వాటిల్లుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది.

ప్రవాసీయుల్లో 90శాతం కార్మికులే..

ప్రవాసీయులలో ప్రధానంగా గల్ఫ్‌ వలసదారుల సంఖ్య అధికంగా ఉంటోంది. వీరిలో 90 శాతం మంది కార్మికులే కావడంతో వారి కుటుంబాలకు ఎన్నో పథకాలను అమలు చేయాల్సిన అవసరం ఉందనే డిమాండ్‌ పెరిగింది. గత కొన్నేళ్లుగా విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో ప్రవాసీ భారతీయ దినోత్సవం జరుపుతూ వలస కార్మికుల సంక్షేమం గురించి గొప్పగా చెబుతున్న నాయకులు ఆచరణలో పథకాలను అమలు చేయడం లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను అంతకుముందు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవాసీయుల సంక్షేమం కోసం నయా పైసా కేటాయించలేదు.

సమస్యలు..

గల్ఫ్‌ దేశాలకు వీసాల జారీ మొదలుకొని వేతనాలు ఎగ్గొట్టడం ఇతరత్రా మోసాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మోసాలను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలం అవుతోంది. అలాగే గల్ఫ్‌ మినహా ఇతర దేశాల్లో ఎవరైనా మరణిస్తే వారి మృత దేహాలను సొంతూర్లకు పంపించడానికి అధికార యంత్రాంగం ఎంతో కృషి చేస్తుంది. గల్ఫ్‌ దేశాల్లో మన దేశంవారు మరణిస్తే మాత్రం మృత దేహాల తరలింపు ఇబ్బందిగా సాగుతుంది. పార్లమెంట్‌ సమావేశాల్లో ఇమిగ్రేషన్‌ యాక్ట్‌ 1983ను సవరించి కొత్తగా ఇమిగ్రేషన్‌ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంది. గతంలో దీనిపై కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆలోచన చేసింది. ఇప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా ఆలోచన చేసినా ఆచరణలో సాధ్యం కాలేదు. ఇమిగ్రేషన్‌ యాక్టులో మార్పుల కోసం ప్రవాసులు డిమాండ్‌ చేస్తున్నారు.

విదేశీ డబ్బు పంపడంలో మనోళ్లే ఫస్ట్‌..

ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మన దేశం వారే విదేశాల నుంచి డబ్బులు పంపించడంలో ముందున్నారని ప్రపంచ బ్యాంకు లెక్కలు చెబుతున్నాయి. భారతీయులు వివిధ దేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేయడం వల్ల 2024లో 125 బిలియన్‌ డాలర్లు అంటే రూ.10.25లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యంను మన దేశానికి చేరవేశారు. ప్రపంచంలో అత్యధికంగా రెమిటెన్స్‌లు అందుకున్న దేశాల్లో మన దేశం మరోసారి అగ్రస్థానంలో నిలచింది. 2023లో రెమిటెన్స్‌లు 1,400 కోట్ల డాలర్లు పెరిగి 12,500 కోట్ల డాలర్లకు చేరింది. కేంద్ర బడ్జెట్‌కు రూ.1,10,700 కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌కు రూ.5,940 కోట్ల ఆదాయంను ప్రవాసీయులు అందించారు.

“ ఆదాయంపైనే దృష్టి..



విదేశాల నుంచి మనవారు పంపిస్తున్న ఆదాయంపైనే ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఈ ఆదాయం ద్వారా ప్రభుత్వాలకు ఎంతో మేలు జరుగుతుంది. కానీ వలస కార్మికులకు మాత్రం ఏమి చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్యక్రమాల ప్రవేశపెట్టినా, కేంద్రం మౌనం వహిస్తుంది.

– గంగుల మురళీధర్‌రెడ్డి, గల్ఫ్‌ జేఏసీ ప్రతినిధి

గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..



గల్ఫ్‌ వలస కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పథకాలను అమలు చేస్తుంది. వలస కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే గల్ఫ్‌ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. గల్ఫ్‌యేతర దేశాల వలస కార్మికుల సంక్షేమంపైనా దృష్టి సారించాలి.

– సిస్టర్‌ లిజీ జోసెఫ్‌, ప్రవాస కార్మిక సంఘాల ప్రతినిధి

గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఫిబ్రవరి 23న కామన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ నిర్వహించనుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం, గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశాల కోసం, ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలోని ఎస్‌ఓఈలలో 8వ తరగతిలో ప్రవేశాల కోసం, అలుగునూరులోని సీఓఈలో 9వ తరగతిలో అడ్మిషన్ల కోసం, రుక్మాపూర్‌ సైనిక్‌ స్కూల్‌, మల్కాజ్‌గిరి ఫైన్‌ ఆర్ట్స్‌ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత ధృవపత్రాలతో ఫిబ్రవరి 1లోపు http:// www. tgcet. cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల కోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామమని కలెక్టర్‌ తెలిపారు.

మహాత్మగాంధీ యూనివర్సిటీ టీం కెప్టెన్‌గా పావని



బాన్సువాడ రూరల్‌: మండలంలోని కొత్తాబాది గ్రామానికి చెందిన కడావత్‌ పావణి మహాత్మ గాంధీ యూనివర్సిటీ మహిళల వాలీబాల్‌ జట్టు కెప్టెన్‌గా ఎంపికైనట్లు కోచ్‌ సురేందర్‌ తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై జేప్పీఆర్‌ యూనివర్సిటీలో ఈనెల 8నుంచి 13వరకు అంతర యూనివర్సిటీల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా యూనివర్సిటీ కెప్టెన్‌గా ఎంపికైన పావనిని, కోచ్‌ సురేందర్‌తోపాటు వాలీబాల్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ హన్మంత్‌రెడ్డి, సెక్రటరీ మల్లేష్‌గౌడ్‌ బుధవారం అభినందించారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం
- స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తి
- వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్‌: మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని, ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలని సంకల్పించి పెద్ద ఎత్తున వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్‌ పవర్‌ప్లాంట్లు నెలకొల్పి వేయి మెగావాట్ల విద్యుత్‌ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఇంధన, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య పరస్పర ఒప్పందం ఖరారైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోలార్‌ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ, ప్రగతిపై వీడియోకాన్ఫరెన్స్‌ ద్వారా డిప్యూటీ సీఎం బుధవారం కలెక్టర్‌తో సమీక్షించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్‌ పవర్‌ ప్లాంట్ల ఏర్పాటు కోసం వారికి అందుబాటులో ఉన్న స్థలాన్ని, ప్రభుత్వ భూములను గుర్తించడంతోపాటు బ్యాంకుల ద్వారా ఆర్థికసాయం అందేలా చొరవ చూపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్‌ శాఖ రెడ్‌ కో ద్వారా టెండర్లను ఆహ్వానించిందని, త్వరలోనే వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా సేకరించాలని పేర్కొన్నారు. దేవాదాయ, ఇరిగేషన్‌ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని, ఆర్‌వోఎఫ్‌ఆర్‌ కింద గిరిజనులకు అందించిన భూములను సైతం అభివృద్ధి చేసుకునేందుకు వెసులుబాటు ఉందన్నారు. సోలార్‌ విద్యుత్‌ అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్‌ ఇరిగేషన్‌ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని, ప్రధానమంత్రి పీఎం కుసుమ్‌ పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు విద్యుత్‌ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉన్నందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులను చైతన్యం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుందని, ఈ మేరకు మినీ ఇండస్ట్రియల్‌ ఏరియాల ఏర్పాటు కోసం స్థల సేకరణపై దృష్టి సారించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్‌ అంకిత్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్‌ క్రైమ్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు
- కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సైబర్‌ విభాగం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

నిజామాబాద్‌అర్బన్‌: సైబర్‌ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్‌ విభాగం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులకు, ఉద్యోగులకు సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సైబర్‌ మోసాల గురించి ప్రస్తావిస్తూ, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా అవగాహన కల్పించారు. ఎవరికీ కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ వివరాలు వెల్లడించకూడదని సూచించారు. ఇటీవలి కాలంలో కేసుల పేరిట ఫోన్‌ కాల్స్‌ చేస్తూ సైబర్‌ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కొందరు యువతులు సోషల్‌ మీడియాలో పరిచయం అయి మాయమాటలతో మభ్యపెట్టి మోసాలకు గురి చేస్తుంటారని అన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్‌ మోసాలకు గురైన వారు ఏమాత్రం సంకోచించకుండా వెంటనే సైబర్‌ విభాగంను సంప్రదిస్తే మోసగాళ్లను గుర్తించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. డీఆర్డీవో సాయాగౌడ్‌, కలెక్టరేట్‌ ఏవో ప్రశాంత్‌, సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌ రావు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో పలువురు మృత్యువాతపడ్డారు. విద్యుత్‌షాక్‌తో ఒక రైతు, రోడ్డు ప్రమాదంలో మరో రైతు దుర్మరణం చెందగా, రైలు ఢీకొని ఒకరు, మెదక్‌ జిల్లాలో బైక్‌ ఢీకొని వృద్ధుడు మృతిచెందారు.

విద్యుత్‌షాక్‌తో రైతు ..



బైని మల్లారెడ్డి (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌ గ్రామంలో విద్యుత్‌ షాక్‌తో ఓ రైతు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రైతు బైని మల్లారెడ్డి (61) బుధవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ బోర్‌ మోటర్‌ను ఆన్‌ చేసేందుకు యత్నించగా అప్పటికే కరెంట్‌ తీగలు స్టార్టర్‌ బాక్స్‌కు తగిలి విద్యుత్‌ సరఫరా కావడంతో మల్లారెడ్డికి విద్యుత్‌షాక్‌ తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రెండు బైక్‌లు ఢీకొనడంతో..

రుద్రూర్‌: కోటగిరి మండలం ఎత్తోండ రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరికి చెందిన రైతు మామిడి లక్ష్మణ్‌(55) పొలం పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఎత్తోండకు చెందిన లస్మయ్య కోటగిరిలో మార్కెట్‌ పనులు ముగించుకొని సొంతూరుకు బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో ఎత్తోండ రహదారిపై ఇరువురు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈఘటనలో లక్ష్మణ్‌ అక్కడికక్కడే మృతిచెందగా, లస్మయ్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.



నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలోని దర్గా వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. మృతుడు నలుపురంగు స్వెటర్‌ ధరించి ఉన్నాడన్నారు. అతడి వయస్సు సుమారు 60 నుంచి 65వరకు ఉండవచ్చని, భిక్షాటన చేసుకునేవారిలా ఉన్నాడన్నారు. మృతుడి సమాచారం ఎవరికైనా తెలిసినచో వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ సంప్రదించాలని తెలిపారు.

రైలు ఢీకొని..

ఖలీల్‌వాడి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ రవికుమార్‌ తెలిపారు. వివరాలు ఇలా.. నిజామాబాద్‌–జాన్కంపేట్‌ మధ్యగల రైల్వే పట్టాలను బుధవారం సాయంత్రం ఓ గుర్తుతెలియని వ్యక్తి దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, సుమారు 25–30ఏళ్ల వయస్సు ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712658591కు సమాచారం అందించాలన్నారు.

బైక్‌ ఢీకొని వృద్ధుడు..

రామాయంపేట(మెదక్‌): మెదక్‌ జిల్లా అక్కన్నపేటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లాలోని రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన దండ బోయిన నారాయణ (58) కుటుంబంతోపాటు అక్కన్నపేట గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో నివాసం ఉంటూ, పని చేస్తున్నాడు. ఈక్రమంలో కిరాణా సామగ్రి కొనుగోలు కోసం మరోవ్యక్తితో కలిసి అక్కన్నపేట వచ్చాడు. తిరిగి తోటకు వెళ్తుండగా అతడిని వెనుక నుంచి బైక్‌ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వెంట ఉన్న వ్యక్తి పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై బాల్‌రాజ్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ..

వర్ని: ఇటీవల బస్సులో నుంచి పడిపోయిన ఓ వ్యక్తికి గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వర్ని ఎస్సై రమేష్‌ తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని అఫాదిఫారం గ్రామానికి చెందిన పాల్త్య కిషన్‌(45) మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైన్‌ స్నాచర్‌ అరెస్టు.. బంగారం రికవరీ

- ఒక్కరోజులోనే కేసును పరిష్కరించిన నవీపేట పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వినయ్‌



పట్టుకున్న బంగారం, సెల్‌ఫోన్లు

నవీపేట: మండలంలోని నందిగాం గ్రామంలో ఇటీవల జరిగిన చైన్‌ స్నాచింగ్‌ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, బంగారు గొలుసును రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 6న నందిగాం గ్రామంలోని ఇందూరు గంగామణి మెడలోనుంచి సుమారు రెండున్నర తులాల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు ఎత్తుకెళ్లిపోయాడు. బాధితురాలు మంగళవారం పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన గంగాధర్‌ను టెక్నాలజీ ద్వారా, సీసీ ఫుటేజీ వెరిఫికేషన్‌ ద్వారా 24 గంటల్లోనే పోలీసులు గుర్తించి నవీపేట్‌ శివాజీ చౌక్‌ దగ్గర వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. అలాగే దొంగిలించిన బంగారు గొలుసును, రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై 2022 అక్టోబర్‌లో భైంసా ఏరియాలో హత్యాయత్నం కేసు నమోదైనట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు.

మామిడిపల్లిలో చైన్‌స్నాచింగ్‌

ఆర్మూర్‌టౌన్‌: మామిడిపల్లిలో మంగళవారం రాత్రి చైన్‌స్నాచింగ్‌ జరిగింది. వివరాలు ఇలా.. మామిడిపల్లిలోని 8 వార్డులో గల లాక్కారం రుకుంబాయ్‌ కార్ఖానాలో బీడీలు ఇచ్చి ఇంటికి వస్తోంది. ఈ తరుణంలో వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని దుండగుడు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లిపోయాడు. బాధితురాలు వెంటపడినప్పటికీ బైక్‌ పారిపోయారన్నారు. అనంతరం బాధితురాలు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెకానిక్‌ షాపులో బైక్‌లు చోరీ



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని బైక్‌ మెకానిక్‌ షాపు నుంచి గుర్తుతెలియని దుండగులు రెండు పల్సర్‌ బైక్‌లను చోరీ చేసినట్లు ఎస్సై ఎండీ షరీఫ్‌ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా మండల కేంద్రంలోని రైల్వేగేటు సమీపంలోని శ్రీవేంకటేశ్వర టూవీలర్‌ బైక్‌ రిపేర్‌ వర్క్‌షాపును మంగళవారం రాత్రి సిబ్బంది ఎప్పటిలాగే పనుల అనంతరం మూసివేసి ఇళ్లకు వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు షట్టర్‌ ధ్వంసం చేసి ఉంది. వెంటనే సిబ్బంది దైవదర్శనం కోసం శబరిమల వెళ్లిన షాపు యజమాని భాస్కర్‌కు ఫోన్‌ ద్వారా సమాచారం ఇచ్చారు. భాస్కర్‌ చోరీ విషయాన్ని డిచ్‌పల్లి పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానిక సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా అర్ధరాత్రి గుర్తుతెలియని ముగ్గురు దుండగులు వచ్చి షట్టర్‌ను గడ్డపారతో ధ్వంసం చేసి లోపల ఉన్న రెండు పల్సర్‌ బైక్‌లను ఎత్తుకెళ్లిన దృశ్యాలు కన్పించాయి. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైన్స్‌షాప్‌లో చోరీకి యత్నం



దుండగులు ధ్వంసం చేసిన వైన్స్‌ దుకాణం షట్టర్‌

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలోగల ఓ వైన్స్‌షాప్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీ ప్రయత్నం చేశారు. వివరాలు ఇలా.. మామిడిపల్లిలోని శ్రీ లక్ష్మినర్సింహ వైన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు షాప్‌ షట్టర్‌ను ధ్వంసం చేస్తుండటంతో శబ్దం రావడంతో అక్కడే పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. కానీ దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. కాగ గాంధీ నగర్‌లోని ఒకరిని పట్టుకొని స్థానికులు పోలీసులకు అప్పగించారు. మొత్తం ఐదుగురు దొంగలు ఉన్నట్లు తెలిసింది. కాగ షాప్‌లో చోరీ జరగలేదని వైన్స్‌షాప్‌ యజమాని తెలిపారు.

ఆటోలో పెద్ద శబ్దంతో పాటలు.. డ్రైవర్‌కు ఒక రోజు జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ ఆటో డ్రైవర్‌ తన ఆటోలో అత్యధిక శబ్దంతో పాటలు పెట్టడంతో కోర్టు ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని రైల్వేస్టేషన్‌ వద్ద బుధవారం తెల్లవారుజామున ఆటోనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్‌ షేక్‌ ముజామిల్‌ (21) తన ఆటోలో అత్యధిక శబ్దంతో పాటలు పెట్టాడు. దీంతో పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ముందు హాజర్చగా ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఆటోలలో అధిక శబ్దంతో పాటలు పెట్టుకుని ప్రయాణికులను, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బాన్సువాడ: బీర్కూర్‌ మండలం బరంగెడ్గి గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బరంగెడ్గి గ్రామ శివారులోని మంజీరనది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్‌ బోల్తా.. ఒకరికి గాయాలు



వర్ని: మండలంలోని సైదిపూర్‌ శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ బోల్తా పడగా, ఒకరికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. గ్రామంలోని సుబ్బా అనే వ్యక్తి బుధవారం వ్యవసాయ పొలంలో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ బోల్తా పడింది. ఈఘటనలో అతడికి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక రైతులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సెల్‌ ఫోన్ల అందజేత

బోధన్‌టౌన్‌: పట్టణ పీఎస్‌ పరిధిలో గతంలో ఫోన్లు పోగొట్టుకున్న 11 మంది బాధితులకు సెల్‌ఫోన్లను రికవరీ చేసి అందించినట్లు ఏసీపీ శ్రీనివాస్‌ బుధవారం తెలిపారు. బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా వివరాలు నమోదు చేయడంతో, విచారణ చేపట్టి, ఫోన్లను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో హుండీ..



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాజంపేట: మండల కేంద్రంలోని స్థానిక పెద్దమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గుడి ప్రాంగణంలోని హుండీ తాళాలు పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ముదిరాజ్‌ సంఘం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు.